సాక్షి
రాజన్న సిరిసిల్ల

సోమవారం । 6 । మార్చి । 2023



శరణు శరణు రాజన్న

వేములవాడ: రాజన్నను ఆదివారం 25 వేల మంది భక్తులు దర్శించుకున్నారు. కోడె మొక్కు, అభిషేకాలు, అన్నపూజలు, కల్యాణాల మొక్కులు చెల్లించుకున్నారు.



'పది' ఫలితాలపై ప్రత్యేక దృష్టి

పదో తరగతి పరీక్షల్లో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు.

8లో

గరిష్ఠం/కనిష్ఠం
36.0/19.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం తక్కువగా నమోదు అవుతుంది. పగటిపూట ఎండగా ఉంటుంది.

న్యూస్‌రీల్

నేడు నియోజకవర్గంలో మంత్రి కేటీఆర్ పర్యటన



తంగళ్లపల్లి(సిరిసిల్ల): సిరిసిల్ల ఎమ్మెల్యే, ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ సోమవారం సిరిసిల్ల నియోజకవర్గంలో పర్యటించనున్నారు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్లలో ఉదయం 11 గంటలకు ప్రభుత్వ పాఠశాలలో డిజిటల్ క్లాస్ రూమ్, సోలార్ ప్లాంట్, 11.30 గంటలకు జిల్లెల్లలో హెల్త్ సెంటర్ ప్రారంభించనున్నారు. 12 గంటలకు మల్లాపూర్ గ్రామపంచాయతీ, 12.30 గంటలకు దేశాయిపల్లిలో ప్రగతి ప్రాంగణం, ప్రభుత్వ పాఠశాల తరగతి గదులు ప్రారంభిస్తారు. అనంతరం గ్రామపంచాయతీ నిర్మాణానికి భూమిపూజ చేస్తారు. మధ్యాహ్నం 1 గంటకు సిరిసిల్ల పట్టణంలో షాదీఖానా, 1.30 గంటలకు కలెక్టరేట్ ఆవరణలో చైల్డ్ కేరింగ్ సెంటర్ ప్రారంభిస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు సిరిసిల్ల ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారోత్సవానికి హాజరుకానున్నారు.

విద్యార్థులకు ఉచితంగా కౌన్సెలింగ్



మాట్లాడుతున్న పున్నంచందర్

సిరిసిల్ల: వివిధ పరీక్షలు జరుగుతున్న ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు ఒత్తిడికి గురవుతున్నారని సైకాలజిస్టుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పున్నంచందర్ అన్నారు. సైకాలజిస్టుల అసోసియేషన్ సమావేశం ఆదివారం సిరిసిల్లలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పరీక్షల సమయంలో విద్యార్థులు మానసిన ఒత్తిడిలో ఉంటారని, ఆత్మవిశ్వాసం కల్పింగేలా సైకాలజిస్టులు ఉచితంగా కౌన్సెలింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. సిరిసిల్లలో నేరుగా వచ్చే వారికి శివనగర్ కమాన్ పక్కన సంజన క్లినిక్‌లో ఉచితంగా విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇవ్వనున్నట్లు వివరించారు. ఫోన్ ద్వారా కౌన్సెలింగ్‌కు ఏ.ఈశ్వర్ 96666 61254, వై.ఆంజనేయులు 83412 28838, సీహెచ్.శ్రీనివాస్ 95059 94399, ఎం.నాగజ్యోతి 95501 65350, కె.తిరుమల 93813 97085, వి.పరమేశ్వర్ 96403 50201 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు ఆడెపు వేణు, జిల్లాలోని సైకాలజిస్టులు పాల్గొన్నారు.

గెలుపే లక్ష్యంగా పని చేయాలి



మాట్లాడుతున్న ప్రతాప రామకృష్ణ

వేములవాడ: వచ్చే ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా ప్రతీ కార్యకర్త పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ అన్నారు. వేములవాడ పట్టణంలోని భీమేశ్వర గార్డెన్‌లో అసెంబ్లీ బూత్ స్థాయి స్వశక్తికిరణ్ అభియాన్ శిక్షణ శిబిరం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బీఆర్‌ఎస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలన్నారు. సమావేశంలో అసెంబ్లీ పాలక్, మాజీ ఎమ్మెల్యే నందీశ్వర్‌గౌడ్, అసెంబ్లీ ప్రభారీ మీసాల చంద్రయ్య, జిల్లా ఇన్‌చార్జి గంగాడి మోహన్‌రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ మార్త సత్తయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎర్రం మహేశ్, ఎంపీపీ బండ మల్లేశం, జిల్లా ప్రధాన కార్యదర్శి రేగుల మల్లికార్జున్, దశరథరెడ్డి పాల్గొన్నారు.

రేవంత్‌రెడ్డిది ఆత్మవంచన ప్రసంగం



మాట్లాడుతున్న తోట ఆగయ్య

సిరిసిల్లటౌన్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పాదయాత్రలో చేసిన ప్రసంగం ఆద్యంతం ఆత్మవంచనతో కొనసాగిందని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య అన్నారు. ఆదివారం సిరిసిల్లలోని ఎమ్మెల్యే క్యాంపు ఆఫీసులో నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో మాట్లాడారు. గతంలో బీసీలను కించపరుస్తూ రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు మరిచాడని విమర్శించారు. తెలంగాణను ప్రజలు ఉద్యమం చేసి కొట్లాడి సాధించుకున్న విషయాన్ని మరువొద్దన్నారు. దమ్ముంటే సిరిసిల్ల వేదికగా పద్మశాలీలు, నేతకార్మికుల అభివృద్ధికి బీఆర్‌ఎస్ సర్కారు అందించిన సంక్షేమంపై బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. రేవంత్‌రెడ్డి ఎంతబలిమాలినా కాంగ్రెస్ అధికారంలోకి రాదన్నారు. సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ న్యాలకొండ అరుణ, మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళ, గ్రంథాలయ చైర్మన్ శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారంలోకి రాగానే సూరమ్మ ప్రాజెక్టు పనులు

- ఇక్కడే కుర్చీలేసుకొని కూర్చుండి పూర్తి చేస్తాం
- నాడు ఓట్ల కోసం పనులు ప్రారంభించిన హరీశ్‌రావు, రమేశ్‌బాబు
- గెలిచిన తర్వాత తట్టెడు మట్టి తీయలే..
- కేసీఆర్ పాలనలో బంధువులు, తెలంగాణ ద్రోహులకే పదవులు
- హాథ్ సే హాథ్ జోడోయాత్రలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి



పాదయాత్రలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, నాయకులు

రుద్రంగి(వేములవాడ): కాంగ్రెస్ అధికారంలోకి రాగానే సూరమ్మ ప్రాజెక్టు వద్ద కుర్చీలేసుకొని కూర్చుండి పనులు పూర్తి చేస్తామని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తెలిపారు. హాథ్ సే హాథ్ జోడో కార్యక్రమంలో భాగంగా ఆయన రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో నిలిచిపోయిన సూరమ్మ ప్రాజెక్టు పనులను ఆదివారం పరిశీలించారు. 2018 ఎన్నికల సమయంలో ఓట్లు దండుకునేందుకు ఆగమేఘాల మీద అప్పటి నీటి పారుదల శాఖ మంత్రి హరీశ్‌రావు, వేములవాడ ఎమ్మెల్యే రమేశ్‌బాబు సూరమ్మ ప్రాజెక్టు పనులు ప్రారంభించారని, గెలిచాక తట్టెడు మట్టి కూడా తీయలేదని పేర్కొన్నారు. తొమ్మిదేళ్ల కేసీఆర్ పాలనలో ఆయన కుటుంబం, బంధువులు, తెలంగాణ ద్రోహులకే ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, మంత్రి పదవులు వచ్చాయన్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి బడుగు, బలహీన వర్గాల అభివృద్ధి జరిగేలా చూడాలని కోరారు. సూరమ్మ చెరువు సందర్శనకు వచ్చిన రేవంత్‌రెడ్డికి గంగపుత్రులు కొర్రమీను, చేపల బుట్టను అందించారు. అంతకముందు రేవంత్ రెడ్డి మండల కేంద్రంలోని ఇందిరాచౌక్‌లో ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాల వేసి జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్, మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, నిజామాబాద్ జిల్లా అధ్యక్షుడు తాహిరెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు, జగిత్యాల జిల్లా కథలాపూర్, మేడిపెల్లి మండలాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరుపేదలకు ఇళ్లు

వేములవాడఅర్బన్: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మించి ఇస్తామని రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు వేములవాడ మండలం రుద్రవరం–సంకెపల్లి గ్రామాల నుంచి ప్రారంభమైన యాత్ర అనుపురం, నాంపల్లి, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా, తిప్పాపూర్ మీదుగా వేములవాడ రాజన్న ఆలయం వరకు కొనసాగింది. ములుగు ఎమ్మెల్యే సీతక్క, మండల నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాదయాత్రలో పాల్గొన్నారు.



సూరమ్మ ప్రాజెక్టును పరిశీలిస్తున్న రేవంత్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, ఆది శ్రీనివాస్

సమస్యలు తెలుసుకుంటూ..

వేములవాడ మండలం అనుపురం శివారులో సంచార కుటుంబాల సమస్యలను రేవంత్‌రెడ్డి తెలుసుకున్నారు. ఇండ్లు లేవని వారు చెప్పడంతో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే కట్టిస్తామని తెలిపారు. నాంపల్లి గ్రామంలో భూములు కోల్పోయిన నిర్వాసితులు వినతిపత్రం అందించారు. కాగా అనుపురం, కొడుముంజ, శాభాష్‌పల్లి, చింతాల్‌ఠాణా గ్రామాల్లోని మిడ్ మానేరు ముంపుగ్రామాల నిర్వాసితులు రేవంత్‌రెడ్డికి ఘనస్వాగతం పలికారు. తమకు పూర్తిగా నష్టపరిహారం అందలేదని పేర్కొన్నారు. రాష్ట్రంలో 23 వేల మంది వీఆర్‌ఏలకు పే స్కేలు, పదోన్నతి, 55 ఏళ్లు నిండిన వీఆర్‌ఏ వారసులకు ఉద్యోగాలు కల్పించాలని జేఏసీ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. అధికారంలోకి రాగానే సమస్యలు పరిష్కరిస్తామని, రూ.5.04 లక్షలతో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు అందిస్తామని తెలిపారు.

చింతాల్‌ఠాణాలో టీ..

పాదయాత్రలో భాగంగా రేవంత్‌రెడ్డి చింతాల్‌ఠాణాలో పాత్తూరి దేవయ్య ఇంట్లో టీ తాగారు. అనంతరం వారి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చాక ఏం అభివృద్ధి జరిగింది, ఏం న్యాయం జరిగింది.. ముంపు గ్రామాల్లో సమస్యలు ఉన్నాయా అని అడుగగా.. 'అయ్యా.. మంచిగా ఉన్న ఊరిలో ప్రాజెక్టు కట్టి ఇండ్లను తీసుకువచ్చి ఈ సీసీరోడ్ల మీద వేసిండ్రు. ఇప్పటికీ పూర్తి పరిహారం రాలేదు' అని వాపోయారు. అధికారంలోకి రాగానే సమస్యలన్నీ పరిష్కరిస్తామని బాధితులకు తెలిపారు.

కాంగ్రెస్‌లో చేరిక

వేములవాడ అర్బన్ మండలం అనుపురం మాజీ సర్పంచ్ ఎర్రం రాజు, రుద్రవరం సింగిల్‌విండో మాజీ చైర్మన్ చింతపల్లి శ్రీనివాసరావు, ఎర్రం సత్తయ్య తదితరులు కాంగ్రెస్‌లో చేరగా రేవంత్‌రెడ్డి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావడానికి తమ వంతు బాధ్యతగా పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు వెంకటస్వామి, మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, జెడ్పీటీసీ నాగం కుమార్, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ హయాంలోనే రాజన్న ఆలయ అభివృద్ధి



కోడె మొక్కు చెల్లించుకుంటున్న రేవంత్‌రెడ్డి, పొన్నం, ఆది

వేములవాడ: వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఆది శ్రీనివాస్ రాజరాజేశ్వరస్వామి ఆలయ చైర్మన్‌గా కొనసాగినప్పుడు భక్తులకు చేసిన అభివృద్ధి పనులు, క్యూలైన్లు తప్ప.. ఇప్పటి వరకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఉదయం మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్, డీసీసీ అధ్యక్షుడు ఆది శ్రీనివాస్‌తో కలిసి రాజన్నను దర్శించుకున్నారు. ఈసందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం అద్దాల మంటపంలో పర్యవేక్షకులు తిరుపతిరావు, శ్రీరాములు, పీఆర్వో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో స్థానాచార్యులు అప్పాల భీమాశంకరశర్మ, అర్చకుల బృందం వేదోక్త ఆశీర్వచనం గావించారు.

ఏడాదిగా అదే ఉత్కంఠ



దేశాయిపల్లి గ్రామం



గ్రామ సమీపంలో జరుగుతున్న అదనపు టీఎంసీ కాల్వ పనులు

- దేశాయిపల్లి గెజిట్ పబ్లికేషన్‌పై తొలగని సందిగ్ధం
- ఇంకా కొలిక్కిరాని ఆర్‌అండ్‌ఆర్ వ్యవహారం
- రెండు మూడు రోజుల్లో జాబితాపై గ్రామసభ?

బోయినపల్లి(చొప్పదండి): కాళేశ్వరం అదనపు టీఎంసీ వరదకాల్వ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న మండలంలోని దేశాయిపల్లి కుటుంబాల గెజిట్ ప్రచురణపై ఏడాదిగా సస్పెన్స్ వీడడం లేదు. వరదకాల్వ నిర్మాణంలో గ్రామంలో కొన్ని ఇళ్లు, కొట్టాలు ముంపునకు గురవుతున్నాయి. ఈ క్రమంలో కుటుంబాల్లో నిర్వాసితులను గుర్తించి పరిహారం అందించేందకు గతంలోనే ఇంటింటికీ అధికారులు వెళ్లి సోషల్ ఎకానమిక్ సర్వే చేశారు.

గతేడాది మార్చి 9న..

- అడిషనల్ కలెక్టర్ ఖీమ్యానాయక్, ఆర్డీఓ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గతేడాది మార్చి 9న సోషల్ ఎకానమిక్ ఆర్‌అండ్‌ఆర్ గ్రామసభ నిర్వహించారు. కాగా ఏడాది కాలంగా అర్హుల జాబితా గెజిట్ పబ్లికేషన్‌పై ఉత్కంఠ కొనసాగుతూనే ఉంది.
- గతంలో కొంతమంది పీడీఎఫ్ (ప్రాజెక్టు డిస్‌ప్లేస్డ్ ఫ్యామిలీ)లతో కూడిన ఒక జాబితాను అధికారులు సిద్ధం చేసినట్లు సమాచారం. ఆ జాబితా మళ్లీ రీ ఎంక్వైరీ చేయాలని జిల్లా కలెక్టర్ స్థానిక అధికారులను ఆదేశించినట్లు తెలిసింది.
- అనంతరం మళ్లీ పలువురు కొత్తగా దరఖాస్తు చేసుకున్నారు. ఈ క్రమంలో ప్రస్తుతం సుమారు 144 పీడీఎఫ్‌లతో ప్రాథమిక జాబితా రూపొందించినట్లు సమాచారం.
- సదరు జాబితాను ఆమోదింపచేసేందకు గ్రామంలో మరో రెండుమూడు రోజుల్లో గ్రామసభ నిర్వహించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నట్లు తెలిసింది. గ్రామస్థాయిలో ఉన్న సమన్వయ లోపం గెజిట్ గ్రామసభ ఆలస్యానికి కారణం అవుతుందని వినికిడి.
- గ్రామంలో వరదకాల్వ నిర్మాణ పనులు జరగాలంటే ఇక్కడ గెజిట్ ఫైనల్ కావాలి. పై నుంచి కాల్వ పనుల్లో వేగం పెంచాలని ఒత్తిడి ఉంది. దీంతో స్థానిక తహసీల్దార్ నరేశ్ సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరిస్తున్నారు.
- విలాసాగర్ రైతుల దీక్షలను విరమింపచేయడంలో తహసీల్దార్ కీలక పాత్ర పోషించారు. దేశాయిపల్లి వ్యవహారం చక్కబడితే వరదకాల్వ నిర్మాణం పనులకు పూర్తిగా లైన్ క్లియర్ అవుతుంది.

నిర్వాసితులకు పరిహారం

గ్రామంలో కాల్వ నిర్మాణంలో ఇండ్లు కోల్పోతున్న ఒక్కో నిర్వాసిత కుటుంబానికి రూ.6.60 లక్షల పరిహారం, ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో ఇంటి నిర్మాణానికి రూ.1.25 లక్షల సాయం, 75 గజాల మేర ఇంటి స్థలం ఇవ్వనున్నట్లు గతంలో గ్రామంలో నిర్వహించిన సభలో అధికారులు తెలిపారు. ఈ క్రమంలో ఇండ్లు ముంపునకు గరవుతున్న వారికి ప్రభుత్వ పరంగా మంచి సాయం అందే అవకాశం ఉంది. గెజిట్‌లో పేరు ఉన్న పీడీఎఫ్‌లకు పై ప్యాకేజీలు వర్తిస్తాయి. ఈ మేరకు గ్రామంలో గెజిట్ ప్రచురణ ప్రాధాన్యత సంతరించుకుంది.

ఆర్‌అండ్‌ఆర్ కాలనీపై వీడని పీటముడి

దేశాయిపల్లి నిర్వాసితుల నివాసానికి ఆర్‌అండ్‌ఆర్ కాలనీ కోసం కొదురుపాక వెళ్లే దారిలో వరద కాల్వ పరిసరాల్లో 11 ఎకరాల మేర స్థలం ఎంపిక చేసి, గతంలో పీఎన్ జారీ చేశారు. ఎంపిక చేసిన స్థలానికి చెందిన వారు తమ భూమి ఇవ్వమని కోర్టు ద్వారా స్టే తెచ్చినట్లు తెలిసింది. కాగా ఏడాది కాలంగా గ్రామంలో కుటుంబాల గెజిట్ జాబితా రూపొందిస్తున్న క్రమంలో ముగ్గురు తహసీల్దార్లు, ఓ డెప్యూటీ తహసీల్దార్, ఒక ఆర్ఐ బదిలీ కావడం గమనార్హం. గతంలో ఇళ్ల స్ట్రక్చర్ల కొలతలను పలు శాఖల అధికారులు రూపొందించినట్లు సమాచారం. కాగా ప్రస్తుతం గ్రామంలో గెజిట్ పబ్లికేషన్ గ్రామసభపైనే అందరి దృష్టి నెలకొంది.

పథకాల అమలు భేష్

- రెండో రోజు ఐఏఎస్ శిక్షణ బృందం పర్యటన

ఎల్లారెడ్డిపేట/ముస్తాబాద్: గ్రామాల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల అమలు భేష్‌గా ఉందని ఐఏఎస్ శిక్షణ బృందం సభ్యులు పేర్కొన్నారు. ఏడు రోజుల పర్యటనలో భాగంగా ఎల్లారెడ్డిపేట మండలం రాజన్నపేట గ్రామంలో ఇంకుడు గుంతలు, నీటి తొట్లు, రోడ్లు, మురికి కాలువలు, మొక్కల పెంపకం తదితర అంశాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులతో పలు అంశాలపై చర్చించారు. తమకు అధికారులు, గ్రామస్తులు పూర్తిస్థాయిలో సహకరిస్తున్నట్లు వివరించారు. అనంతరం వేములవాడ రాజన్నను దర్శించుకున్నారు. తర్వాత మిడ్‌మానేరు ప్రాజెక్టును సందర్శించి వాటర్ సోర్స్ గురించి అడిగి తెలుసుకున్నారు. అలాగే ఇంకో బృందం సభ్యులు ముస్తాబాద్ మండలం నామాపూర్ గ్రామంలో సీనియర్ సిటిజన్లతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం ఉపాధి అవకాశాలు ఎలా ఉన్నాయి, నేటి తరం జీవన స్థితిగతులపై ఆరా తీశారు. స్వాతంత్రం అనంతరం దేశం ఏ ఏ రంగాల్లో అభివృద్ధి చెందిందో అడిగి తెలుసుకున్నారు. విద్య, ఉపాధి మౌలిక వసతుల కల్పనను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కార్యక్రమాల్లో శిక్షణ ఐఏఎస్‌లు అర్జున్ గుప్తా, అంచల్ జైన్, పంకజ్ మీనా, హర్షిత్ అగర్వాల్, అంకిత్ మండల్, అభిషేక్ కుమార్, సౌరభ్‌కాంత్, ఆన్‌మోల్, అమిత్‌కుమార్, భావనమిత్ర, ఎంపీడీవో రమాదేవి, సర్పంచులు ముక్క శంకర్, విజయ, ఎంపీటీసీ లలిత, ఎంపీవో ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న ఐఏఎస్ బృందం



రాజన్న సన్నిధిలో కామదహనం

వేములవాడ: రాజరాజేశ్వరస్వామి సన్నిధిలో ఆదివారం రాత్రి కామదహనం వేడుకలు ఘనంగా జరిగాయి. ఆలయ మహాద్వారం వద్ద అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, స్థానికులు, భక్తులు పాల్గొన్నారు.

సిగ్నల్ పడేదెప్పుడో?

- సిరిసిల్లలో నియంత్రణ లేని ట్రాఫిక్
- మూడు నెలలుగా నిరుపయోగంగా సిగ్నల్స్
- సిరిసిల్ల నేతన్నచౌక్‌లో తొలిసారి ఏర్పాటు
- ఏడు కూడళ్లలో ఏర్పాటుకు బ్రేక్

సిరిసిల్ల: పెరుగుతున్న వాహనాల సంఖ్య.. మితిమీరిన వేగం.. నిత్యం జరుగుతున్న ప్రమాదాలు.. వాహనదారుల మధ్య వాగ్వాదాలు.. పోలీసు కేసులు.. నియంత్రణ లేని ట్రాఫిక్ వ్యవస్థ.. ఇది సూక్ష్మంగా రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిత్యం కనిపించే పరిస్థితులు. ఈ సమస్యను పరిష్కరించేందుకు సిరిసిల్లలో మూడు నెలల క్రితం ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసి, పనితీరు పరిశీలించారు. అయితే వాటిని ప్రారంభించే విషయమై నిర్లక్ష్యం పేరుకుపోయింది. ఫలితంగా ట్రాఫిక్ సిగ్నల్స్ అలంకారప్రాయంగా మిగిలాయి.

తొలిసారి సిగ్నల్స్ ఏర్పాటు

రాజన్నసిరిసిల్ల జిల్లాలో ప్రతి నెలా కొత్తగా వెయ్యి వాహనాలు రోడ్లపైకి వస్తున్నాయి. కొత్త బైక్‌లు, కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు వంటి అన్ని వాహనాలు కలిపి ప్రతీ నెల వెయ్యి వాహనాలు రోడ్డుపైకి వస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఇబ్బందిగా మారింది. సిరిసిల్లలో ట్రాఫిక్ సమస్యను కట్టడి చేసేందుకు సిగ్నల్ వ్యవస్థను గతేడాది నవంబరులో తొలిసారిగా ఏర్పాటు చేశారు. లక్ష జనాభా ఉన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ సిగ్నల్స్ బిగించి వదిలేశారు. పట్టణంలో అత్యంత రద్దీగా ఉండే పాతబస్టాండులోని నేతన్నచౌక్‌లో తొలి ట్రాఫిక్ సిగ్నల్ ఏర్పాటైంది. ఆ తరువాత .. సిరిసిల్ల పట్టణ శివారులోని రగుడు కలెక్టరేట్ సర్కిల్, సిరిసిల్ల పట్టణ ముఖద్వారంగా భావించే విద్యానగర్‌లోని కొండా లక్ష్మణ్ బాపూజీ జంక్షన్, సిరిసిల్ల పోలీస్‌స్టేషన్ ముందు సర్కిల్ వద్ద, గాంధీచౌక్‌లో, కొత్తబస్టాండు తెలంగాణతల్లి విగ్రహం, చంద్రంపేట సర్కిల్ ప్రాంతాల్లో ట్రాఫిక్‌సిగ్నల్స్ ఏర్పాటు చేయనున్నారు.



జిల్లా కేంద్రంలో పని చేయని ట్రాఫిక్ సిగ్నల్స్

మంత్రి కేటీఆర్ ఆదేశాలతో..

సిరిసిల్ల పట్టణం వేగంగా విస్తరిస్తోంది. అదేస్థాయిలో వాహనాల రద్దీ పెరిగింది. పెరిగిన వాహనాల సంఖ్యకు అనుగుణంగా సిరిసిల్లలో ట్రాఫిక్ సమస్యను సిగ్నల్స్ ఏర్పాటుతో నియంత్రించే అవకాశం ఉందని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర మంత్రి కె.తారక రామారావు భావించారు. సిరిసిల్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుకు మంత్రి ప్రతిపాదించారు. మున్సిపల్ అధికారులు, ఆర్‌అండ్‌బీ, పోలీసుల సమన్వయంతో పనిచేసి సిరిసిల్ల ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈమేరకు సిరిసిల్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. కానీ మూడు నెలల క్రితం ప్రయోగాత్మకంగా పరిశీలించారు. ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేసిన యాడ్ ఏజెన్సీ మాత్రం ప్రధాన కూడళ్లలో బోర్డులను ఏర్పాటు చేసి యాడ్స్ వేసుకుంటూ ఆదాయం పొందుతుంది. ట్రాఫిక్ సిగ్నల్స్ మాత్రం పనిచేయడం లేదు. మున్సిపల్ పాలకవర్గం, అధికారులు చొరవచూపి ట్రాఫిక్ సిగ్నల్స్‌ను వినియోగంలోకి తేవాల్సిన అవసరం ఉంది.

ఏడాది కిందట సర్వేలు

సిరిసిల్లలో ఏడాది కిందట మున్సిపల్ చైర్‌పర్సన్ జిందం కళాచక్రపాణి, అప్పటి ఆర్‌అండ్‌బీ ఈఈ కిషన్‌రావు, డీఈఈ రవి, మున్సిపల్ టౌన్‌ప్లానింగ్ అధికారి అన్సార్, సిరిసిల్లటౌన్ సీఐ అనిల్‌కుమార్, హైదరాబాద్‌కు చెందిన యాడ్ ఏజెన్సీ ప్రతినిధి నాగేశ్వర్‌రావు క్షేత్రస్థాయిలో సర్వేలు చేశారు. సిరిసిల్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటుతో పట్టణంలో ట్రాఫిక్ వ్యవస్థ నియంత్రణలోకి రానుంది. వాహనదారులకు క్రమపద్ధతి అలవడుతుంది.

వారం రోజుల్లో వినియోగంలోకి..



సిరిసిల్లలో ట్రాఫిక్ సిగ్నల్స్ సిద్ధంగా ఉన్నాయి. వారం రోజుల్లో వాటిని వినియోగంలోకి తెస్తాం. మున్సిపల్ చైర్‌పర్సన్ చేతుల మీదుగా ప్రారంభిస్తాం. మున్సిపల్‌పై ఎలాంటి ఆర్థిక భారం పడకుండా యాడ్ ఏజెన్సీ నిర్వాహకులే సిగ్నల్స్ ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీ ఉండే ఇతర ప్రాంతాల్లోనూ ఏర్పాటు చేయిస్తాం.

– వెల్దండి సమ్మయ్య, మున్సిపల్ కమిషనర్, సిరిసిల్ల

క్లుప్తంగా

రేవంత్‌రెడ్డిని కలిసిన బీసీ విద్యార్థి సంఘం నాయకులు



రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందిస్తున్న బీసీ విద్యార్థి సంఘం నాయకులు

సిరిసిల్ల అర్బన్ : హాథ్ సే హాథ్ జోడోయాత్రలో భాగంగా సిరిసిల్ల జిల్లాకు వచ్చిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డిని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కో ఆర్డినేటర్ కంచర్ల రవిగౌడ్ కలిశారు. బీసీ జనగణన గురించి పార్లమెంట్‌లో లేవనెత్తాలని ఆయనకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బీసీ కుల జనగణన పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు.

రాజన్న సేవలో కేంద్ర వాణిజ్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్



రవితేజను సత్కరిస్తున్న ఆలయ ఇన్‌స్పెక్టర్

వేములవాడ: వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని ఆదివారం కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ దూలం రవితేజ దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు వారికి ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం ఆయనను ఆలయ ఇన్‌స్పెక్టర్ సంకెపల్లి పవన్‌కుమార్ సత్కరించారు.

నియామకం



లగిశెట్టి శ్రీనివాస్

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ప్రముఖ వ్యాపారి, మాజీ 'సెస్' వైస్ చైర్మన్ లగిశెట్టి శ్రీనివాస్ బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా నియమించినట్లు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

కోడెల అప్పగింత



గోశాలకు అందిస్తున్న ఆలయ అధికారులు

వేములవాడఅర్బన్ : వేములవాడ రాజన్న తిప్పాపూర్ గోశాలలోని ఆవులు, కోడెలను ఆదివారం వరంగల్ జిల్లా నెక్కొండ మండలం మహబూబ్ నాయక్ గ్రామానికి చెందిన మంజునాథ గోశాలకు తరలించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు శ్రీనివాస్, శ్యామ్, శంకర్ తదితరులుఉన్నారు.

'పది' ఫలితాలపై ప్రత్యేక దృష్టి

- విద్యార్థులకు ప్రత్యేక తరగతులు
- ఉదయం సాయంత్రం అల్పాహారం అందజేత
- వందశాతం ఫలితాలు సాధించేందుకు కృషి



స్టడీ మెటీరియల్స్ గురించి వివరిస్తున్న రాష్ట్ర పర్యవేక్షకుడు రమేశ్‌రావు

సిరిసిల్ల ఎడ్యుకేషన్ : పదో తరగతి పరీక్షలు దగ్గర పడుతున్నాయి. ఏప్రిల్ 3 నుంచి పరీక్షలు ప్రారంభం కానుండగా అందుకు విద్యార్థులు సన్నద్ధమవుతున్నారు. విద్యార్థులు పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించేదిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. పరీక్షా విధానాన్ని ఇప్పటికే సంబంధిత బోధనా ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు. అంతేకాక విద్యార్థులకు రోజువారీగా సబ్జెక్టుల్లో తగు సూచనలు, సలహాలు చేస్తున్నారు. పదిలో ఉత్తమ ఫలితాలను సాధించేందుకు ముందుకెళ్తున్నట్లు విద్యాశాఖ అధికారులు వెల్లడించారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో ఉదయం, సాయంత్రం విద్యార్థులకు ప్రత్యేక తరగతులను నిర్వహిస్తున్నారు.

ప్రత్యేక స్టడీ మెటీరియల్స్..

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లోని పదో తరగతి విద్యార్థులకు సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో ప్రత్యేక స్టడీ మెటీరియల్స్‌ను అందించి అభ్యసనా చేయిస్తున్నారు. ప్రత్యేక తరగతుల సమయంలో అల్పాహారం అందిస్తున్నారు. ప్రైవేటులో మారిన పరీక్ష విధానాన్ని విద్యార్థులకు వివరిస్తూ వివిధ కంపెనీలు తయారు చేసిన స్టడీ మెటీరియల్స్ ప్రభుత్వ పరీక్షా విధానం బ్లూ ప్రింట్ ఆధారంగా అభ్యసనా చేయిస్తున్నట్లు సమాచారం. గతంలో పదో తరగతిలో 11 పరీక్షలుండగా ఈసారి ఆరు పరీక్షలకు మాత్రమే కుదించిన విషయం తెలిసిందే. ఈ విషయాన్ని విద్యార్థులకు వివరిస్తూ పరీక్షలు జాగ్రత్తగా రాసేలా సూచిస్తున్నారు.

ఇంటర్నల్ మార్కుల పర్యవేక్షణ..

పదో తరగతి విద్యార్థులకు ఇంటర్నల్‌గా ఒక్కో సబ్జెక్టు 20 మార్కుల కేటాయింపు ఉంటుంది. విద్యార్థులు రాసిన క్లాస్‌వర్క్, స్లిప్ టెస్ట్, ప్రాజెక్టు వర్క్ ఆధారంగా సంబంధిత సబ్జెక్టు టీచర్లు కేటాయిస్తున్నారు. వీటిన్నింటిని జిల్లా విద్యాధికారి ఆదేశాల మేరకు సీనియర్ ఉపాధ్యాయులు జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు వెళ్లి తనిఖీ చేస్తారు. పర్యవేక్షణ అనంతరం నిర్ణీత తేదీల్లో వీటన్నింటి రాష్ట్ర సెకండరీ ఎడ్యుకేషన్ సైట్‌లోని పరీక్ష విభాగం కేటాయించిన పేజీలో పొందుపరుస్తారు. ఇంటర్నల్ మార్కుల కేటా యింపులు, వాటిని జిల్లా పర్యవేక్షణ బృందంలో ఉపాధ్యాయులు తనిఖీ చేయడం పూర్తికాగా ప్రస్తుతం రాష్ట్ర పర్యవేక్షకులు జిల్లాలో తనిఖీలు చేస్తున్నారు.

జిల్లాలో పదో తరగతి పరీక్ష రాసే విద్యార్థులు

ప్రభుత్వ పాఠశాలలు నుంచి – 3579
ప్రైవేటు పాఠశాలల నుంచి – 2917

పదో తరగతిలో సాధించిన ఫలితాలు..

విద్యా సంవత్సరం	ఉత్తీర్ణతశాతం
2016–17	87.3
2017–18	91.3
2018–19	97.7
2019–20	100 శాతం (కరోనా)
2020–21	100 శాతం (కరోనా)
2021–22	95.76

జిల్లాను ప్రథమ స్థానంలో నిలుపుతాం



పదో తరగతి ఫలితాల్లో జిల్లాను రాష్ట్రంలో ప్రథమ స్థానంలో నిలుపుతాం. రోజువారీగా విద్యార్థుల అభ్యసనా, సాధిస్తున్న ప్రగతిని నేరుగా పర్యవేక్షిస్తున్నాం. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా ఆయా సబ్జెక్టుల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయుల ఫోన్ నెంబర్లను విద్యార్థులకు అందుబాటులో ఉంచుతున్నాం. – రమేశ్ కుమార్, డీఈవో

బాగా చదువుతున్నా



ఉదయం, సాయంత్రం వేళలో పాఠశాలలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏమైనా సందేహాలుంటే ఉపాధ్యాయులను అడిగి నివృత్తి చేసుకుంటున్నా. ఇంటర్నల్ మార్కులపై తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతుల సమయంలో చదివింది ఎక్కువ గుర్తు ఉంటుండడంతో బాగా చదువుతున్నా. – అంకిత, పదో విద్యార్థి, వేములవాడ

ఎమ్మెల్యే రమేశ్‌బాబుపై చార్జిషీట్

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్



సమావేశంలో మాట్లాడుతున్న ఆది శ్రీనివాస్

వేములవాడ అర్బన్: వేములవాడ ఎమ్మెల్యే చెన్నమనేని రమేశ్‌బాబు వైఖరి, వెనుకబడిన పట్టణ అభివృద్ధిపై కాంగ్రెస్ చార్జిషీట్‌ను విడుదల చేస్తున్నామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆది శ్రీనివాస్ అన్నారు. వేములవాడ మండలం రుద్రవరం– సంకెపల్లి గ్రామాల వద్ద టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చేపట్టిన హాథ్ సే హాథ్ జోడోయాత్ర బస కేంద్రం వద్ద ఆదివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నియోజకవర్గంలో కంటే జర్మనీలోనే ఎక్కువగా ఉండడంతో ఈ ప్రాంతం అభివృద్ధికి నోచుకోలేదన్నారు. రాజన్న ఆలయానికి ఏటా రూ.100 కోట్లు కేటాయిస్తామని చెప్పిన సీఎం కేసీఆర్ మోసం చేశారనన్నారు. మధ్యమానేరు ముంపుగ్రామాల నిర్వాసితులకు రూ.5.04 లక్షలు ఇస్తామని హామీ ఇచ్చి నెరవేర్చలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తి చేస్తామని తెలిపారు. పట్టణ అధ్యక్షుడు సాగరం వెంకటస్వామి, పార్టీ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, ముడికె చంద్రశేఖర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువతికి తీవ్రగాయాలు

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): మండలంలోని రాగట్లపల్లి శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువతికి తీవ్రగాయాలయ్యాయి. వివరాల్లోకి వెళ్తే.. సిరిసిల్ల పట్టణంలోని సాయినగర్‌కు చెందిన ఆకాంక్ష (20) ఎల్లారెడ్డిపేట మండలకేంద్రంలోని బంధువుల ఇంటికి శుభకార్యానికి వెళ్లింది. తిరుగు ప్రయాణంలో రాగట్లపల్లి శివారు వద్ద ద్విచక్రవాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న డివైడర్‌ను ఢీకొంది. దీంతో ఆమెకు తీవ్రగాయాలు కాగా ఉపసర్పంచ్ రాజు 108కు సమాచారం అందించారు. చికిత్స కోసం సిరిసిల్లకు ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



నృత్యం చేస్తున్న చిన్నారులు

ధర్మపురి: ధర్మపురి లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం శేషప్ప కళావేదికపై ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను అలరించాయి. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రముఖ కళాకారులు పలురకాల ప్రదర్శనలు ఇచ్చారు. వివిధ పాఠశాలలకు చెందిన చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఇందారపు రామన్న, ఈవో సంకటాల శ్రీనివాస్, సిబ్బంది అలువాల శ్రీనివాస్, వావిలాల తిరుపతి, ధర్మకర్తలు పాల్గొన్నారు.



వైభవంగా డోలోత్సవం

వేములవాడ: వేములవాడ రాజన్న సన్నిధిలో శ్రీరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామివారికి అద్దాల మండపంలో డోలోత్సవం వైభవంగా నిర్వహించారు.

మూసివేత దిశగా బీ-థర్మల్..?!

- విద్యుత్ కేంద్రానికి బొగ్గు, ఆయిల్ నిలిపివేత
- సాంకేతిక లోపాలతో పెరుగుతున్న యూనిట్ ధర
- నిధుల కేటాయింపుపై మొగ్గు చూపని రాష్ట్ర ప్రభుత్వం



బీ-థర్మల్ విద్యుత్ కేంద్రం

రామగుండం: రామగుండంలోని 62.5 మెగావాట్ల విద్యుత్ సామర్థ్యం గల బీ-థర్మల్ కేంద్రం క్రమంగా మసకబారుతోంది. తరచూ సాంకేతిక లోపాలతో సతమతం అవుతున్న కేంద్రానికి 40రోజులుగా బొగ్గు, ఆయిల్ సరఫరా నిలిచిపోయింది. తద్వారా కేంద్రాన్నే మూసి వేయాల్సి వస్తుందని ఇంజినీర్లు, అధికారులు చర్చించుకుంటున్నారు. రాష్ట్రానికి వెలుగులు పంచాలన్న ఉద్దేశంతో రూ.14.8 కోట్లతో 1965 జూలై 19న బీ-థర్మల్‌కు శంకుస్థాపన చేశారు. క్రమంగా 500 మెగావాట్లకు విస్తరించాలని నిర్ణయించినప్పటికీ 62.5 మెగావాట్లకే పరిమితం చేశారు.

విద్యుత్ ఉత్పత్తిలో అనేక రికార్డులు

విద్యుత్ కేంద్రం ఆరంభం నుంచే వార్షిక విద్యుత్ ఉత్పత్తితోపాటు పీఎల్ఎఫ్ (ప్లాంట్ లోడ్ ఫ్యాక్టర్)లో అనేక రికార్డులు సాధించింది. ప్రతి ఆర్థిక సంవత్సరంలో 260 రోజులు నడిపించిన దాఖలాలు కూడా ఉన్నాయి. కేంద్రం ఏర్పాటు చేసి 50 ఏళ్లు గడుస్తుండడం.. తరచూ సాంకేతిక లోపాలు తలెత్తుతుండడంతో వాటి విడిభాగాలు ప్రస్తుతం లభ్యం కావడం లేదు. ప్రత్యామ్నాయ పరికరాలు బిగించి కేంద్రాన్ని నడిపిస్తున్నారు. అయినా ఈ ఏడాది ప్రారంభం నుంచే నాలుగు రోజులసాసారి బాయిలర్ ట్యూబ్స్ లీకేజీ అవుతున్నాయి. టర్బయిన్‌లో సాంకేతిక సమస్యలు ఏర్పడుతున్నాయి. దీంతో ఉత్పత్తి కూడా 40మెగావాట్లకు పడిపోయి.. యూనిట్ ధర రూ.ఏడుకు పైగా పెరుగుతోంది.

కేంద్రం అనుమతిచ్చినా..

ప్రస్తుతం విద్యుత్ డిమాండ్ అధికంగా ఉండడంతో స్థానిక వనరుల లభ్యతతో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉన్న కేంద్రాలను మరో పదేళ్లు నడిపించేందుకు వెసులుబాటు కల్పిస్తూ సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) ఉత్తర్వులు జారీ చేసింది. అయితే దీనిపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పందన లేకపోగా.. ఇంధన సరఫరా నిలిపివేసింది. జనవరి 26 నుంచి ఇంధన సరఫరా నిలిపివేయడంపై స్థానిక ఎమ్మెల్యే విద్యుత్‌శాఖ మంత్రి జగదీష్‌రెడ్డిని కలిసి విన్నవించారు. ఆయన సీఎండీని ఆదేశించినప్పటికీ ఇంధన సరఫరా కాలేదని ఇంజినీర్లు తెలిపారు.

మూసివేతకే ప్రభుత్వ నిర్ణయం..?

కాలం చెల్లిన విద్యుత్ కేంద్రం పునరుద్ధరణకు నిధులు కేటాయించలేమని విద్యుత్ సౌధ ఉన్నతాధికారులు నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఇందులో భాగంగానే ఇంధన సరఫరా నిలిపివేసినట్లు సమాచారం. బొగ్గు, ఆయిల్ నిల్వలు పూర్తయ్యే వరకూ నడిపించి మూసివేయాలని ఓ డైరెక్టర్ స్పష్టం చేసినట్లు స్థానికంగా చర్చ జరుగుతోంది. అదే జరిగితే ఇక బీ-థర్మల్ చరిత్ర కనుమరుగు కానుంది.

రైలుకిందపడి మహిళ మృతి

- ప్రాణాలతో బయటపడ్డ ఎనిమిదేళ్ల బాలుడు
- సింగరేణి రైలులో కిక్కిరిసిన ప్రయాణికులు

ఓదెల: కాజీపేట్ నుంచి బల్లార్షా మధ్య పొత్కపల్లి రైల్వేస్టేషన్‌లో కాల్వశ్రీరాంపూర్ మండల పరిధి లోని ఆరెపల్లి జీపీ అనుబంధ గ్రామమైన మల్లయ్యపల్లెకు చెందిన శ్రీమంతుల భాగ్యమ్మ(55) మహిళ సింగరేణి రైలుకిందపడి ఆదివారం మధ్యాహ్నం మృతిచెందింది. ప్రత్యక్ష సాక్షుల కథనం ప్రకారం.. మల్లయ్యపల్లెకు చెందిన భాగ్యమ్మ తన ఎనిమిదేళ్ల మనవడితో పొత్కపల్లి నుంచి రవీంద్రఖనికి వెళ్లేందుకు రైల్వేస్టేషన్‌కు చేరుకుంది. కిక్కిరిసిన ప్రయాణికులతో వచ్చిన రైలులో మనవడితో ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు కాలు జారీకింద పడడంతో కాళ్లుచేతులు తెగి అక్కడిక్కడే ప్రాణాలు కోల్పోయింది. చేతిలో ఉన్న మనవడిని మాత్రం బయటకు నెట్టివేయడంతో ప్లాట్‌ఫాంపై పడి ప్రాణాలతో బయటపడ్డాడు. సమాచారం అందుకున్న కుటుంబ సభ్యులు పొత్కపల్లి రైల్వేస్టేషన్లో రోదనలు మిన్నంటాయి. మృతురాలికి ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటన స్థలాన్ని రామగుండం జీఆర్పీఎఫ్ పోలీసులు సందర్శించి కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. భాగ్యమ్మ మృతి వార్త తెలియడంతో స్వగ్రామైన కాల్వశ్రీరాంపూర్ మండలం మల్లయ్యపల్లెలో విషాద ఛాయాలు అలుముకున్నాయి.

చేపలవేటకు వెళ్లి యువకుడి మృతి



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు



శ్రీకాంత్ (ఫైల్)

కోనరావుపేట (వేములవాడ) : చేపల వేటకు వెళ్లిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు చెరువులో పడి మృతిచెందాడు. మండలంలోని నిజామాబాద్ శివారులోని ఎల్లమ్మకుంటలో పదిమందితో కలిసి ఉప్పుల రామస్వామి–గౌరవ్వ దంపతుల కుమారుడు శ్రీకాంత్ (25) కూడా వెళ్లాడు. శ్రీకాంత్ చెరువులోకి కొద్దిదూరం వెళ్లగా ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. తోటివారు గమనించి గాలింపు చేపట్టగా మృతదేహం లభ్యమైంది. అయితే చెరువులోని కందకంలో పడి చనిపోయాడా..లేక గుండెపోటుతో మృతిచెందాడా తెలియాల్సి ఉంది. దీనిపై పోలీసులు విచారణ చేపట్టారు. బాధిత కుటుంబాన్ని సర్పంచ్ కేతిరెడ్డి అరుణ, వైస్ ఎంపీపీ వంగపెల్లి సుమలత పరామర్శించారు.

మట్టి రవాణా చేస్తున్న ట్రక్కు స్వాధీనం

మల్లాపూర్(కోరుట్ల): ఒబులాపూర్ నుంచి రాఘవపేటకు మట్టిని అక్రమంగా రవాణా చేస్తున్న ట్రక్కును రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. దానిని స్థానిక తహసీల్దార్ కార్యాలయానికి తరలించారు. కాగా, వారంరోజులుగా మట్టి అక్రమంగా తరలిస్తున్న ట్రక్కుకు స్వాధీనం చేసుకున్న అధికారులు.. అందులోకి మట్టి నింపుతున్న జేసీబీని సీజ్ చేయకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

మెరుగైన వైద్యం అందక యువకుడి మృతి



రాజు (ఫైల్)

ఎల్లారెడ్డిపేట (సిరిసిల్ల): కూలీ పనులు చేస్తే తప్ప.. పూటగడవని ఆ కుటుంబాన్ని విధి వెంటాడింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని సింగారం గ్రామానికి చెందిన సంపంగి రాజు మూత్రపిండాల వ్యాధితో బాధపడుతున్నాడు. కొద్ది రోజులుగా నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా కుటుంబ సభ్యులు ఇప్పటికే రూ.3 లక్షల వరకు వైద్యం కోసం ఖర్చుచేశారు. మెరుగైన వైద్యం అందించేందుకు స్థోమత లేకపోడంతో రెండురోజుల కింద ఇంటికి తీసుకురాగా ఆదివారం మృతిచెందాడు. మృతుడికి తండ్రి మల్లయ్య, సోదరి ఉంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సర్పంచ్ నర్సగౌడ్, ఎంపీటీసీ మధు, గ్రామస్తులు కోరారు.

వృద్ధురాలి ఆత్మహత్య

పెగడపల్లి: జీవితంపై విరక్తి చెంది ఓ వృద్ధురాలు ఆత్మహత్య చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఆరవెల్లి గ్రామానికి చెందిన పన్నటి లక్ష్మీ (80) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. శనివారం రాత్రి ఎప్పటిలాగే కుటుంబ సభ్యులతో పాటు భోజనం చేసింది. ఉదయం చూసేసరికి ఇంట్లో కనిపించలేదు. కుటుంబ సభ్యులు గ్రామంలోని పలుచోట్ల వెతకగా గ్రామంలోని ఓ వ్యవసాయ బావిలో మృతదేహం లభ్యమైంది. అనారోగ్యంతోనే ఆమె ఆత్మహత్య చేసుకున్నట్లు బంధువులు తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సత్తయ్య తెలిపారు.

ఎస్సారెస్పీ కాలువలో బీటెక్ విద్యార్థి గల్లంతు

- బంధువుల ఇంటికి వచ్చిన యువకుడు
- ఈతకొడుతూ గల్లంతైన వైనం
- మరో యువకుడు క్షేమం



గల్లంతైన వ్యక్తి



ఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న సీఐ

మానకొండూర్: బంధువుల ఇంట్లో జరిగే దైవ కార్యక్రమానికి మహారాష్ట్రలోని నాందేడ్ నుంచి కరీంనగర్‌కు వచ్చిన ఓ యువకుడు ఎస్సారెస్పీ కాలువలో పడి గల్లంతైన ఘటన ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. మురారి రితికేష్ (23) యువకుడు ఐఐటీ బీటెక్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మహారాష్ట్రలోని నాందేడ్ ఖరగ్‌పూర్ నుంచి శనివారం రాత్రి కరీంనగర్‌లో ఉంటున్న తన అమ్మమ్మ, మేనమామల ఇంటికి చేరుకున్నాడు. రాత్రి బంధువుల ఇంట్లో నిర్వహించిన దైవకార్యక్రమంలో (దుర్గమ్మ కొలుపు) పాల్గొన్నాడు. ఉదయాన్నే నిద్రలేచి తన మేనమామ డోలిశ్రీనివాస్, డోలి ప్రసాద్, డోలి బద్రినాత్, డోలి జతిన్‌తో కలిసి మురారి రితికేష్ సరదాగా ఈతకు వెళ్దామని మానకొండూర్ మండలంలోని ఈదులగట్టిపల్లికి కారులో వెళ్లారు. గ్రామ శివారులో కల్లుతాగి సమీపంలోని ఎస్సారెస్పీ కాలువ ర్యాంపు వద్ద ఈతకొడుతుండగా కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉండడంతో రితికేష్‌తో పాటు, జతిన్ (20) ఇద్దరు నీటిలో కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న శ్రీనివాస్, ప్రసాద్ జతిన్‌ను కాపాడారు. ఇంతలోనే రితికేష్ నీటిలో కొట్టుకుపోయి గల్లంతయ్యాడు. జతిన్ క్షేమంగా ప్రమాదం నుంచి బయట పడగా రుతికేష్ నీటిలో గల్లంతవడంతో మేనమామలు కన్నీటి పర్యంతమయ్యారు. విషయం తెలుసుకున్న పోలీసులు సీఐ రాజ్‌కుమార్ సిబ్బంది ఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. ప్రమాదానికి గల కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఎస్సారెస్పీ కాలువ నీటిని నిలిపివేయించి జాలర్లతో గాలింపు చర్యలు చేపట్టారు. గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి. రితికేష్ తండ్రి రాజేందర్ పదేళ్లక్రితం మృతిచెందగా, తల్లి భవానీ ప్రభుత్వ ఉద్యోగిగా పనిచేస్తోంది. ఓ చెల్లి కూడా ఉందని సమాచారం.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్ర గాయాలు

కోరుట్ల రూరల్ : మండలంలోని మోహన్‌రావుపేట గ్రామ శివారులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామానికి చెందిన బోయినిపెల్లి గంగారాం మేడిపెల్లి వైపునుంచి మోహన్‌రావుపేటకు టీవీఎస్ మోపెడ్‌పై వస్తుండగా కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో గంగారాంకు తీవ్ర గాయాలు కాగా 108 అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.